



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 20 జనవరి 2026 పేజీలు 8

# పశుగణ రంగానికి పునర్వైభవం



**పశుగణ రంగమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారం**

**లింగ నిర్ధారిత వీర్యనాళికలతో పెయ్య దూడల ఉత్పత్తి పెంపు**

**గుడ్లు, పాలు, మాంస ఉత్పత్తుల్లో దేశంలోనే ఏపీ అగ్రస్థానం దిశగా అడుగులు**

**జన్మభూమి తరహాలో రాష్ట్రవ్యాప్తంగా**

**ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు, పశుపోషకులకు భరోసా**

**ఈ నెల 19 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శిబిరాల ఏర్పాటు**

**వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పశుగణ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని వ్యవసాయ, పశుసంవర్ధక శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నియంత్రణ, పశుపోషణ ఖర్చుల తగ్గింపే లక్ష్యంగా జన్మభూమి తరహాలో మిగతా 2లో



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం మంత్రి  జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి నగరంలోని రహదారులు భవనాలు అతిథి గృహంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ముఖ్యంగా మచిలీపట్నం నియోజకవర్గంలో చేపట్టిన గృహ నిర్మాణ పథకం, మచిలీపట్నం నగర పాలక సంస్థ, ముడా పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్, సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతంలో 6,185 ఇంటి ప్లాట్ లకు గాను 4,550 ఇల్లు మంజూరు చేసి కేటాయించగా 2010 ఇల్లు కొన్ని పూర్తయి మరికొన్ని పురోగతిలో ఉన్నాయన్నారు. అలాగే పట్టణ ప్రాంతంలో 20,602 ఇళ్ల ప్లాట్లకు గాను 15,588 ఇళ్ళు మంజూరు చేసి స్థలాలు కేటాయించగా 3,018 ఇల్లు కొన్ని పూర్తికాగా, మరికొన్ని పురోగతిలో ఉన్నాయన్నారు. పురోగతిలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ప్లాట్లను, ఇంకా నిర్మాణం మొదలుపెట్టని ఇళ్ల వివరాలను వెంటనే సేకరించాలన్నారు. మునిసిపల్ పరిధిలో వివిధ మిగతా 2లో...





## నైనవరంలో....

# కాలుష్యం చిమ్ముతున్న రైస్ మిల్

పచ్చగా ఉండాల్సిన పల్లెలు నేడు కాలుష్య కోరలలో చిక్కుకుని ప్రజల ప్రాణాలకు ప్రమాదంగా మారాయి. ప్రకృతి వైపరిత్యాలు ఒక ప్రక్క మానవ తప్పిదాలు మరో ప్రక్క నైనవరం గ్రామస్తుల పాలిట శాపాలుగా మారాయి. ఊరి మధ్యలో రైస్ మిల్లు ఉండటంతో గ్రామంలో కాలుష్యం చిమ్ముతుంది. ఎవరికి మొరపెట్టుకున్నా... ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమకు న్యాయం జరగటం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక వ్యక్తి స్వార్థం కోసం ధనార్జనే ధ్యేయంగా ఊరిలో నీరు కలుషితం అవుతున్నా తినే ఆహారం కలుషితం అవుతున్నా పసువులు మృత్యువాత పడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. నైనవరంగ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నేటి దినపత్రిక సూర్య ప్రత్యేక కథనం....



- ప్రజారోగ్యంతో చెలగాటం....
- వ్యాధుల బారిన పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు... పొల్యూషన్ బోర్డు ఎక్కడ
- కలుషితమౌతున్న తాగే నీరు.... తినే తిండి
- ప్రాణరక్షణ కల్పించండంటున్న ప్రజలు

వివరాలు 2లో

(విజయవాడ రూరల్, మేజర్ న్యూస్)

# పశుగణ రంగానికి పునర్వైభవం



(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ శిబిరాల కార్యక్రమాన్ని విజయవాడ రూరల్ మండలంలోని నిడమానూరు గ్రామంలో సోమవారం ఉదయం ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, పశుపోషణ రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో పశువుల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశు పాలకులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు చికిత్సలు చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. పశువులకు ఉచిత వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీతో పాటు శాస్త్రీయ పశు యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పశుగణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తోందని, ముఖ్యంగా మహిళల జీవనోపాధికి ఈ రంగం కీలకమని పేర్కొంటూ, పశుపోషకులకు పూర్తి భరోసా కల్పించేలా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### దేశవ్యాప్తంగా ఏపీ పశు సంపదకు గుర్తింపు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు, పుంగనూరు ఆవులు, గోదావరి గేదెలు, నెల్లూరు, మాచెర్ల గొర్రెలు, అశీల్ కోళ్లకు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 108.19 లక్షల ఆవులు, గేదెలు, 231.49 లక్షల గొర్రెలు, మేకలు (దేశంలో రెండవ స్థానం), 1078.63 లక్షల కోళ్లు ఉండగా, సుమారు 25 లక్షల రైతు కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. పశుగణ రంగం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.1,67,000 కోట్ల ఆదాయం లభిస్తోందని, ఇది 202425 ఆర్థిక సంవత్సరంలో జీవీఏలో 10.26 శాతంగా ఉన్నట్లు మంత్రి వివరించారు. పశుగణ ఉత్పత్తుల్లో రాష్ట్రం 2739 కోట్ల గుడ్ల ఉత్పత్తితో దేశంలో మొదటి స్థానం, 11.30 లక్షల మెట్రిక్ టన్నుల మాంస ఉత్పత్తితో నాలుగవ స్థానం, 139.40 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తితో ఏడవ స్థానంలో నిలిచిందని తెలిపారు.

### గ్రామగ్రామాన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2025లో పశువుల ఆరోగ్య రక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధి నియంత్రణ, పశుపోషణ ఖర్చుల తగ్గింపు లక్ష్యంగా రాష్ట్రంలోని 13,257 గ్రామాలలో జన్మభూమి తరహాలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించామని మంత్రి తెలిపారు. ఈ శిబిరాల ద్వారా 10,48,980 పశువులకు వైద్య సేవలు అందించడంతో పాటు 5,36,387 మంది పశుపోషకులు లబ్ది పొందారని చెప్పారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది జనవరి 19 నుంచి 31 వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ శిబిరాలలో పశు వైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ పశు యాజమాన్యంపై అవగాహనా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న పథకాలలో భాగంగా రూ.52 కోట్ల వ్యయంతో 1,29,800 మంది పశుపోషకులకు 23,302 మెట్రిక్ టన్నుల బలపాల పశు దాణాను 50 శాతం రాయితీపై పంపిణీ చేశామని, అలాగే రూ.28.32 కోట్లతో 4,111 టన్నుల పశుగ్రాస విత్తనాలను 75 శాతం రాయితీపై 1,22,833 మందికి అందించామని మంత్రి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పశుగ్రాసానికి కూడా ఈ క్రాప్ చేసే విధంగా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.

### గోకులాల షెడ్లు, పశు బీమా, లింగ నిర్ధారిత వీర్యనాళికలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానంగా 7090 శాతం రాయితీతో ఇప్పటి వరకు 58,440 గోకులాల షెడ్లు నిర్మించామని, 202627లో మరో 50,000 షెడ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. పశుపోషకులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు 85 శాతం రాయితీతో పశు బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. పెయ్య దూడల ఉత్పత్తి పెంపుకోసం 50 శాతం రాయితీతో లింగ నిర్ధారిత వీర్యనాళికలను రూ.150కే అందిస్తూ ఈ ఆర్థిక సంవత్సరానికి 10 లక్షల వినియోగ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో మరణించిన పశువులకు కూటమి ప్రభత్వం 150 కోట్ల నష్ట పరిహారం చెల్లించిదని, ప్రస్తుతం 3 సంవత్సరాలకు గాను 1920 రూపాయల భీమాలో రైతు కేవలం 288 రూ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

### కూటమి ప్రభుత్వంతో పశుగణ రంగానికి పునర్జీవనం

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జన్మభూమి కార్యక్రమాల ద్వారా పశు ఆరోగ్య శిబిరాలు పండగ వాతావరణంలో నిర్వహించేవారని, గత ప్రభుత్వంలో ఈ రంగం పూర్తిగా నిర్వీర్యమైందని



మంత్రి విమర్శించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పశుగణ రంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ గత సంవత్సరం మంగళగిరి నుంచి ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అంతరించిపోతున్న ఒంగోలు జాతి పశువులకు పునర్వైభవం తీసుకువస్తామని, ఖాళీగా ఉన్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది నియామకంపై త్వరలోనే ముఖ్యమంత్రితో చర్చించి ప్రకటన చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ వెటర్నరీ యూనివర్సిటీ కాంపౌండ్ వాల్ ను త్వరలోనే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు 104 నెంబర్ టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేస్తే వైద్య సేవలు అందిస్తారో,,,1962 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేస్తే పశువులకు వైద్యం అందించేందుకు అంబులెన్స్ లు గ్రామాలకు చేరుకుంటాయని వెల్లడించారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పశుసంవర్ధక రంగం ముఖ్యంగా మహిళల జీవనోపాధికి కీలకమని పేర్కొన్న మంత్రి అచ్చెన్నాయుడు, స్వర్ణాంధ్ర2047 లక్ష్యంగా పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తుల్లో దేశంలో తొలి మూడు స్థానాల్లో నిలవాలనే దిశగా స్పష్టమైన కార్యాచరణ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మచిలీపట్నం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు వీరంకి గురుమూర్తి, గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, టిడిపి నాయకులు గొడ్డళ్ల చిన్న రామారావు, బండి వెంకట్రావు (నాని), దయాల రాజేశ్వరరావు, గూడపాటి తులసి మోహన్, కోనేరు నాగేంద్ర కుమార్, బిజెపి నాయకులు కురుమద్దాలి ఫణి కుమార్, కానూరి శేషు మాధవి, నాదెండ్ల మోహన్, ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి, జనసేన పార్టీ నాయకులు పొదిలి దుర్గారావు, మేకల స్వాతి తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మురికి కాలువలు, రహదారుల నిర్మాణ పనులను ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన సత్వరమే పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో అందరు ఓడరేవు, ఫిషింగ్ హార్బర్ త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా వాటి ఆధారంగా వివిధ పరిశ్రమలు నెలకొల్పేందుకు చాలామంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని వారందరినీ ప్రోత్సహించేందుకు వీలుగా అవసరమైన స్థలాలను వెంటనే కేటాయించుటకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అలాగే నియోజకవర్గంలో మంగినపూడి బీచ్ ఆధారంగా పర్యాటక అభివృద్ధికి సంబంధించిన వివిధ పనులను చేపట్టే దిశగా ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి మచిలీపట్నం ఇన్చార్జ్ ఆర్డిఓ పోతురాజు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, ప్రజారోగ్య శాఖ ఈ ఈ ప్రవీణ్, ముడా కార్యాలయ సిటీ ప్లానర్ సుగుణ కుమారి, తహసిల్దారు మధుసూదన్ పలువురు ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉడత్తు రామారావు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం చల్లపల్లిలో గ్రామ ఆర్యవైశ్య ప్రముఖులు ఉడత్తు రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామారావు ఇటీవల మృతి చెందగా, వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. రామారావు కుమారులు వెంకటేశ్వరరావు, రాంగోపాల్ లను పరామర్శించారు. ఆయన వెంట చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఆర్యవైశ్య ప్రముఖులు ఉడత్తు బాబు, జల్లూరి ప్రసాద్, వరదా హరిగోపాల్, నాయకులు షేక్ నబీఘోరీ, ఉరిమి మణికాంత్ ఉన్నారు.

## నైనవరంలో కాలుష్యం చిమ్ముతున్న రైస్ మిల్






**(విజయవాడ రూరల్, మేజర్ న్యూస్)**

విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలో సత్యన్నారాయణ రైస్ మిల్ పేరుతో ఒక మిల్ నడుస్తుంది. గత కొద్ది కాలంగా మిల్ నుంచి దుర్వాసన రావటం, దుమ్ము, దూగర చెలరేగటంతో తీవ్ర ఇబ్బందులు పడు తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగే నీటిలో, తినే ఆహారంలో సైతం దూగర కలవటంతో అనారోగ్యాల పాలవుతున్నామని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.గ్రామంలోని బాధితులు దూగర కారణంగా శ్వాసకోస వ్యాధులు తలెత్తుతున్నాయని, అంతే కాక చర్మ వ్యాధులు వస్తున్నాయని అంటున్నారు. రైస్ మిల్ పొల్యూషన్పై యజమానిని ప్రశ్నించగా చేసేది ఏమీ లేదు ఇక్కడి నుంచి మీరు పోయి వేరే చోట బ్రతకండని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని వాపోతున్నారు. అడగటానికి వెళ్ళిన వారిపై పోలీసులతో తప్పుడు కేసులు పెట్టించి కొట్టిస్తున్నాడని నేటి దిన పత్రిక సూర్య రిపోర్టర్ ముందు సమస్య తీవ్రతను గురించి బాధితులు చెప్పుకున్నారు. అధికారులను తన అర్ధ బలంతో వశ పరుచుకోవటంతో వారు రైస్ మిల్ యజమానికి వత్తాసు పలు





కుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఎంత మంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి క్షేత్ర స్థాయి అధికారులు సమస్యను నీరు గార్చటంతో గ్రామస్థులకు న్యాయం జరగటం లేదు. నేటి దినపత్రిక సూర్య ప్రజా పక్షాన నిలబడి గ్రామస్తుల సమస్య పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో వారి కష్టాలను చిత్రీకరించి ప్రత్యే కథనాలను ప్రచురిస్తున్నాం. నైనవరం గ్రామప్రజల సమస్య పరిష్కారం అయ్యే వరకు వరుస కథనాలు...

# ఎసెట్‌ప్లస్‌కు రూ.175 కోట్ల నిధులు

**నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ నేతృత్వంలో పెట్టుబడి**

**అసిస్టెడ్ వెల్త్ మేనేజ్‌మెంట్ భవిష్యత్ నిర్మాణానికి బలం**



**విజయవాడ, జనవరి 19, మేజర్ న్యూస్ :** భారతదేశంలో పూర్తిగా డిజిటల్-అసిస్టెడ్ వెల్త్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన ఎసెట్‌ప్లస్‌కు నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ నేతృత్వంలో జరిగిన ఫండింగ్ రౌండ్‌లో రూ.175 కోట్ల పెట్టుబడి లభించింది. డిస్ట్రిబ్యూటర్ ఆధారితంగా, దీర్ఘకాలికంగా నిలిచే వెల్త్ మేనేజ్‌మెంట్ మౌలిక వసతులను దేశంలో నిర్మించాలనే సంస్థ లక్ష్యానికి ఇది కీలక ముందడుగని ఎసెట్‌ప్లస్ తెలిపింది. ఈ సంస్థకు ఎయిట్ రోడ్స్ వెంచర్స్, నితిన్ కామత్ రైన్‌మ్యాటర్ ఫండ్, భూపీందర్ సింగ్ మద్దతు ఇస్తున్నట్లు పేర్కొంది. సంపదసృష్టిని కేవలం లావాదేవీలు లేదా టూల్స్‌కే పరిమితం చేయలేమనే నమ్మకంతో ఎసెట్‌ప్లస్ సమగ్ర 'అసిస్టెడ్ వెల్త్ మేనేజ్‌మెంట్' ఎకోసిస్టమ్‌ను రూపొందిస్తోంది. టెక్నాలజీ సాయంతో మానవ సలహా మరింత ప్రభావవంతంగా మారే విధానాన్ని సంస్థ అమలు చేస్తోంది తప్ప, పూర్తిగా మనుషుల ప్రమేయం లేకుండా చేయదు. భారతీయ కుటుంబాలకు నమ్మకమైన, సర్టిఫైడ్ డిస్ట్రిబ్యూటర్లు స్థిరంగా, మెరుగ్గా, విస్తృత స్థాయిలో సేవలు అందించేలా చేయడంపైనే సంస్థ దృష్టి పెట్టింది. మా లక్ష్యం మరో డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్‌ను నిర్మించడం కాదు. మానవ సలహాను టెక్నాలజీ స్కేల్‌తో కలిపే వెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మిస్తున్నాం. దీర్ఘకాలంలో భారత వెల్త్ ఎకోసిస్టమ్ బలోపేతాన్ని నమ్మే ఇన్వెస్టర్లతో కలిసి ఆ దిశగా వేగంగా ముందుకెళ్లేందుకు ఈ పెట్టుబడి తోడ్పడుతుంది" అని ఎసెట్‌ప్లస్ సహ-వ్యవస్థాపకుడు, సీఈఓ విశ్రాంత్ సురేశ్ తెలిపారు. ఇప్పుడు తాజాగా అందిన పెట్టుబడిని టెక్నాలజీ స్టాక్‌ను మరింత బలోపేతం చేయడానికి, ప్రొడక్ట్ ఆఫరింగ్స్ విస్తరించడానికి, సమగ్ర సంపద నిర్వహణకు తోడ్పడే కార్యక్రమాలను బలోపేతం చేయడానికి వినియోగిస్తామని ఎసెట్‌ప్లస్ తెలిపింది. మ్యూచువల్ ఫండ్స్ ప్లాట్‌ఫామ్‌కు కేంద్రంగా కొనసాగుతాయని, అదే సమయంలో హెల్త్, టర్మ్ ప్లాన్స్ లాంటి ఆఫరింగ్స్‌తో ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా పూర్తి స్థాయి ఫైనాన్షియల్ సొల్యూషన్స్ అందించేలా డిస్ట్రిబ్యూటర్లకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. భారత పెట్టుబడుల రంగంలో నిర్మాణాత్మక మార్పు వస్తోందని ఎసెట్‌ప్లస్ పేర్కొంది. మార్కెట్లలో పాల్గొనేవారి సంఖ్య పెరుగుతోంది, అవగాహన విస్తరిస్తోంది, లక్షల మంది తొలితరం ఇన్వెస్టర్లు మార్కెట్లోకి అడుగుపెడుతున్నారు. అదే సమయంలో 'డీఐవై' విధాన పరిమితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని సంస్థ తెలిపింది. మార్కెట్ ఒడిదుడుకులు, భావోద్వేగ నిర్ణయాలు, ఫ్రాగ్మెంటెడ్ ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్, దీర్ఘకాలిక ప్రణాళిక లేకపోవడం లాంటి అంశాలు కేవలం యాక్సెస్ ఉంటే సరిపోదని చెబుతున్నాయని పేర్కొంది. ఇన్వెస్టర్లకు మార్గదర్శనం, సందర్భానుసార దిశానిర్దేశం, నిరంతర మద్దతు అవసరం పెరుగుతోందని వివరించింది. దేశంలో సంపదసృష్టి తదుపరి దశ 'అసిస్టెడ్ మోడల్స్' ఆధారంగా ముందుకు సాగుతుందని ఎసెట్‌ప్లస్ అభిప్రాయపడింది. టెక్నాలజీతో డిస్ట్రిబ్యూటర్లు రిస్క్-అడ్జస్టెడ్, గోల్-ఓరియెంటెడ్ ఇన్వెస్టింగ్ సిఫారసులు అందించేలా ప్లాట్‌ఫామ్ రూపొందిస్తున్నట్లు తెలిపింది. ప్రొడక్ట్స్‌ను నెట్టే విధానానికి బదులు, లైఫ్-స్టేజ్ ఆధారిత ఫైనాన్షియల్ నిర్ణయాలకు తోడ్పాటు ఇచ్చేలా ఎడ్వైజ్, కాంప్లయెన్స్, ఆపరేషన్స్, అనేక ఫైనాన్షియల్ సొల్యూషన్స్‌ను ఒకే చోట, నిరవధిక అనుభవంగా అందిస్తున్నట్లు పేర్కొంది.



## ఐవీఎం సేవలు స్ఫూర్తిదాయకం

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** పేదవర్గాలకు అండగా ఉంటూ విద్య, వైద్యం, జీవనోపాధికి సహాయం అందిస్తున్న ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవలు స్ఫూర్తిదాయకం అని ఎల్వి.ప్రసాద్ హాస్పటల్ ఆప్తమాలజీ కన్సల్టెంట్ డాక్టర్ జి.దివ్య అన్నారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఐవీఎం ఆధ్వర్యంలో పురిటిగడ్డ, నడకుదురు, యార్లగడ్డ గ్రామాలకు చెందిన 100 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను వితరణగా అందచేశారు. సోమవారం ఐవీఎం హోమ్లో జరిగిన కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న డాక్టర్ దివ్య, ఐవీఎం డైరెక్టర్ డా. వేములపల్లి సురేష్ - రోజా దం పతులతో కలిసి పేదలకు సరుకులను పంపిణీ చేశారు. ప్రతి నెలా నిరుపేదలకు సహాయం చేయటం తోపాటు పర్మినెంట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతిభావంతులైన పేద పిల్లలకు ప్రతి ఏటా ఫీజులు కట్టి చదివించటం, ఉన్నతవిద్యకు సహకారం అందించటం ముదావహం అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి వేములపల్లి విజయ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష శివలింగాలు తయారీ ప్రారంభం

**మాజీ ఎంపీపీ సూర్యభవాని**



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** గుంటూరు జిల్లా తాళ్ళాయపాలెంలోని భారత ధర్మ దేవత బ్రహ్మచారి శ్రీ శివస్వామి మహాసంస్థానము శ్రీశైవక్షేత్రములో మహాశివరాత్రి సందర్భంగా అహోరాత్ర కోటి పార్థివ లింగార్చన మహా జాగరణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 15 న మహాశివరాత్రి కోటిలింగాలకు అభిషేకం నిర్వహించనున్నారు. ఘంటసాల నుంచి లక్ష మట్టి శివలింగాలు కోటి లింగార్చనకు సమర్పించేందుకు సోమవారం అంకురార్పణ చేశారు. తాళ్ళాయపాలెం శివాలయం నుంచి పుట్టమట్టి, తదితరాలు ఘంటసాలకు పంపించగా, మాజీ ఎంపీపీ అందె సూర్యభవాని, మహిళలు శివలింగాల తయారీని ప్రారంభించారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తిభావంతో లక్ష శివలింగాలు తయారు చేసి ఫిబ్రవరి 10 లోగా తాళ్ళాయపాలెం శివాలయానికి పంపించాల్సి ఉందని మాజీ సర్పంచ్, బీసీ నేత అందె జగదీష్ అందించటం జరుగుతుందని, భక్తిభావంతో తయారు చేసి తమకు అందజేయవచ్చునని ఆయన తెలిపారు.

# ముస్లింలపై రాజకీయ పార్టీల వివక్ష

**మైనార్టీ భూములు అంటే ప్రభుత్వాలకు ఎందుకు అంత చులకన**

**రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా**






**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ముస్లింలపై అన్ని రాజకీయ పార్టీలు వివక్షత చూపుతున్నాయని, ముస్లిం భూములు అంటే ప్రభుత్వాలకు అంత చులకన ఎందుకని దుయ్యబట్టారు రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా. మంగళగిరిలో అంజుమన్ భూములను అల్తాఫ్ బాబా, భారత చైతన్య యోజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాడు ముస్లింలు ఓట్లు వేయించుకొని ముస్లింలను జగన్ మోసం చేశారని, నేడు కూటమి ప్రభుత్వం అదే దారిలో వెళ్తుందని అన్నారు. ముస్లింలకు అన్యాయం జరుగుతుంటే ఆమడ దూరంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీల ఓట్లు కావాలి కానీ వారి కష్టాలు పట్టవా అని అన్నారు. సొంత నియోజకవర్గంలో ఇంత వివాదం జరుగుతుంటే మంత్రి నారా లోకేష్ ఎందుకు ముస్లిం సంఘాలతో చర్చలు జరపడం లేదన్నారు. వక్ఫ్ బోర్డు అన్యాయాలనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లిన కృష్ణా జిల్లా ప్రభుత్వ ఖాజీ ను సస్పెండ్ చేయడం దేనికి నిదర్శనం అని అన్నారు, తమ అన్యాయాలను ప్రశ్నించిన వారిని వేధించడం వక్ఫ్ అధికారులకు అలవాటుగా మారిందని తెలిపారు. ముస్లింల భూములు అభివృద్ధి చేయాలంటే వారితో చర్చలు జరిపి ప్రణాళికలు సిద్ధం చేయాలని, అంతేకానీ ఇష్టానుసారంగా లాక్కోవడం సరైన పద్ధతి కాదని ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు.

## అవార్డ్ గెలిచిన లాంగిట్యూడ్ 77




**విజయవాడ, జనవరి 19, మేజర్ న్యూస్ :** పెర్నాడ్ రికార్డ్ ఇండియా నుండి ఇండియన్ సింగిల్ మాల్ట్ లాంగిట్యూడ్ 77 హైదరాబాద్‌లో విజయవంతంగా ప్రారంభించింది. తమ సుసంపన్నమైన భారతదేశపు కళా పనితనం, అంతర్జాతీయ నైపుణ్యతతో హైదరాబాద్‌కి చెందిన అర్హత కలిగిన విజ్ఞులను ఆకర్షిస్తోంది. హైదరాబాద్‌లోని ద తాజ్ ఫలక్ నుమా పాలెస్‌లో ఒక ప్రత్యేకమైన కార్యక్రమం ద్వారా ఈ విడుదల సంబరం జరిగింది. వాస్తవమైన, సమకాలీన భారతదేశపు విలాస సాటిలేని అనుభవాన్ని అతిథులకు అందిస్తోంది. తమ సాటిలేని నాణ్యత కోసం అంతర్జాతీయంగా గుర్తించబడిన లాంగిట్యూడ్ 77 ప్రతిష్టాత్మకమైన ప్రశంశలను అందుకుంది. వీటిలో లండన్ స్పిరిట్స్ పోటీలో బంగారు పతకం, ద స్పిరిట్స్ బిజినెస్, మోండే సెలక్షన్ ద్వారా ద గ్లోబల్ స్పిరిట్స్ మాస్టర్స్, ద ఇంటర్నేషనల్ వైన్ అండ్ స్పిరిట్స్ పోటీలో కాంశ్య పతకం ఉన్నాయి. ఈ అవార్డ్స్ శ్రేష్టత పట్ల బ్రాండ్ అచంచలమైన నిబద్ధతను ప్రపంచంలోని ఉత్తమమైన విస్కీలలో దీని పెరుగుతున్న ఖ్యాతిని చూపిస్తున్నాయి.

## కనులపండువగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ



**గుడ్లవల్లేరు జనవరి 19 మేజర్ న్యూస్ :** భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ ఊంజల సేవను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్ధ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి భారీ విరాళం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా లంకపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవల వెంకటేశ్వరరావు సరస్వతి దంపతుల జ్ఞాపకార్థం, వారి కుమారులు చెన్నకేశవల నాగమలేశ్వర రావు - ఉమామహేశ్వరి దంపతులు, చెన్నకేశవల నాని - సంధ్యారాణి దంపతులు శ్రీకాకుళం గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జున స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి 5 లక్షల విరాళాన్ని అందజేశారు. దాతలను కూటమి నేతలు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), దాసం రామకృష్ణ, కొండవీటి కోటేశ్వరరావు, తమ్మన సోమేశ్వరరావు, మేక పుల్లయ్య, నవతా రాంబాబు, తమ్మన తాతయ్య, గాజుల సత్యం, గాదె వెంకటేశ్వరరావు తదితరులు ఘనంగా సన్మానించి అభినందించారు. పలువురు కూటమి నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొని ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ప్రశంసనీయమని కొనియాడారు.

## కొసరాజు తల్లిదండ్రులను పరామర్శించిన ఎమ్మెల్యే





**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు తల్లిదండ్రులు అనారోగ్య కారణాలతో విశ్రాంతి తీసుకుంటుండగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా వారిని పరామర్శించారు. స్వయంగా వెంకటేశ్వరరావు స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన తల్లిదండ్రులతో కొద్దిసేపు ముచ్చటించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు పార్టీ సీనియర్ నాయకులు కొసరాజు రాంబాబు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరుని దర్శనానికి భక్తుల తాకిడి







**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జనవరి 19:** డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తుల తాకిడి అధికమైంది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణ నడుమ వైభవంగా వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆలయ నిర్వాహకులు కె.బాపి రెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ఉన్నారు.




## ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహణ

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొర్నిపాడు, వానపాముల గ్రామాల్లో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. సోమవారం ఉదయం కొర్నిపాడు గ్రామంలో ప్రస్తుత శాఖ ఎలమర్రు సహాయ సంచాలకులు డాక్టర్ జీవీ నరసింహారావు శిబిరాన్ని ప్రారంభించారు. పశు వైద్యులు డాక్టర్ వనిత డాక్టర్ రామలక్ష్మి జితర సిబ్బంది పాల్గొని పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ గ్రామంలో 30 పశువులకు గర్భకోశ వ్యాధికి సంబంధించిన చికిత్సలను చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు అలాగే అనంతరం వానపాములలో నిర్వహించిన శిబిరంలో 25 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. అలాగే ఈ వైద్య శిబిరాలలో 21దూడలకు, 70 గొర్రెలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. సోమవారం ప్రారంభించిన ఈ ఉచిత పశు వైద్య శిబిరాలు ఈ నెల 31వ తేదీ వరకు అన్ని గ్రామాలలోనూ నిర్వహిస్తామని, కావున పశు పోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పశువులకు అవసరమైన చికిత్సలు చేయించుకోవాలని డాక్టర్ నరసింహారావు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈనెల 20వ తేదీన నాగాపురం, సోమవరప్పాడు గ్రామాలలో, 21వ తేదీన మహేశ్వరపురం, భూషణగుళ్ళ గ్రామాలలో, 22వ తేదీన గురువిందగుంట పెదపారుపూడి గ్రామాలలో, 23వ తేదీన యలమర్రు, గొల్లపాలెం గ్రామాలలో, 24వ తేదీన ఈదులమద్దాలి, జవ్వలపాలెం గ్రామాలలో, 27వ తేదీన చినపారుపూడిలో, 28వ తేదీన మోపర్రు, దోసపాడు గ్రామాలలో, 29వ తేదీన వింజరంపాడు, వెంట్రప్రగడ గ్రామాలలో, 30వ తేదీన పాముల పాడు, రావులపాడు గ్రామాలలో, 31వ తేదీన అప్పికట్ల, జమీదింటకుర్రు గ్రామాలలో ఈ ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నరసింహారావు ప్రకటించారు.

## బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేయండి

**మంత్రి దుర్గేష్‌ను కోరిన భంతే దమ్మ ధజ థెరో**



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** గోదావరి పుష్కరాల్లోపు ఘంటసాల గ్రామంలో అసంపూర్తిగా ఉన్న బుద్ధ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఘంటసాల అమరావతి బుద్ధ విహార్ భంతే దమ్మ ధజ థెరో మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. రాజమండ్రిలో ఏపీ టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో దమ్మ దజ థెరో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి దుర్గేష్ చేతులు మీదగా సద్ధమ్మ ఉపాసత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఘంటసాలలో నిర్మిస్తున్న 100 అడుగుల సింహాశయన బుద్ధ భగవానుల ప్రాజెక్ట్ గురించి చర్చించారు. ఈ ప్రాజెక్టు చాలా ముఖ్యమైనదని చెప్పి గోదావరి పుష్కరాలకు ముందే పూర్తి చేసేందుకు కృషి చేయాలని మంత్రి దుర్గేష్ ను కోరినట్లు బంతేజీ తెలిపారు. ముందుగా మంత్రి దుర్గేష్ కు బంతేజీ పంచశీల కండువా కప్పి బుద్ధుని ఆశీస్సులు అందించారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ప్రేరణ స్ఫూర్తి స్టడీ మెటీరియల్ ను మండలంలోని డోకిపర్రు హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు డోకిపర్రు సర్పంచ్ గోసాల జ్యోతి సోమవారం పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా పరిషత్ ద్వారా ఈ స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ 1 జి. జగన్మోహన్రావు తెలిపారు. విద్యార్థులు వీటి ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలని గ్రామ సర్పంచ్ జ్యోతి కోరారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి. సత్యనారాయణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రొయ్యూరులో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహణ





**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రొయ్యూరు గ్రామంలో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా గ్రామ సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాసు, పిఏసిఎస్ చైర్మన్ లుక్కా రేణుకారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉప్పులూరి గోపాలకృష్ణ, పిఏసీఎస్ మాజీ అధ్యక్షులు లుక్కా ఓంకార మూర్తి, ఎస్సీ సెల్ నాయకులు చప్పిడి చంద్రమోహన్, చిన్న, థామస్ తదితరులు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో పశు వైద్య శాఖ ఉయ్యూరు సహాయ సంచాలకులు డాక్టర్ రామశేఖర్, తోట్లవల్లూరు పశు వైద్యాధికారిణి డాక్టర్ సాయిపూర్ణిమ, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ మోహనరావు, కొంగల రామారావు, థామస్, నాగేంద్ర, గోపాలమిత్ర రాజేశ్వరరావు తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో దాదాపు 200 గేదలకి, 150 గొర్రెలకి వైద్య సేవలు అందించటంతో పాటు పశువులకు, గొర్రెలకు నట్టల నివారణ మందును వేశారు. అంతేకాక పశువులకు బభీమా పథకంలో గతప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందించగా ప్రస్తుత ప్రభుత్వం 85 శాతం సబ్సిడీని ఇస్తోందని డాక్టర్ రామశేఖర్ ఈ సందర్భంగా రైతులకు వివరించారు. ఈ అవకాశాన్ని వస పోషకులు వినియోగించుకుని తమ పశువులకు తప్పని సరిగా బీమా చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై రైతులు సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ నిర్ణయం పట్ల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉచిత పశువైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. స్థానిక పశు వైద్యశాలలో నాపరాయి, ఫ్లోరింగ్ దెబ్బతినటం గమనించిన ఉప్పులూరి గోపాలకృష్ణ తన స్వంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణను అభినందించి డాక్టర్ రామశేఖర్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## పిట్ట కొంచెం నృత్యం ఘనం

**అతి చిన్న వయసులో రవీంద్రభారతిలో గుడ్లవల్లేరు చిన్నారి నత్య ప్రదర్శన**

**వరుస నత్య ప్రదర్శనలతో అందర్నీ ఆకట్టుకుట్టున్న శ్రీరన్విత**



**గుడ్లవల్లేరు జనవరి 19 మేజర్ న్యూస్ :** హైదరాబాదు రవీంద్రభారతిలో నృత్య ప్రదర్శన ఇవ్వాలని ఎంతోమంది నృత్య కళాకారులకు కోరిక ఉంటుంది. కానీ గుడ్లవల్లేరులో ఏడేళ్ల చిన్నారికి ఆ అదృష్టం లభించింది. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన దాసి సత్యనారాయణ, శ్రీదివ్య దంపతుల గారాలపట్టి శ్రీరన్విత అనే చిన్నారి హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం నృత్య ప్రదర్శన ఇచ్చింది. గుడివాడ కేకేఆర్ గౌతమ్ కాన్సెప్ట్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న శ్రీరన్విత ఒకటో తరగతిలోనే గుడివాడ గీతా భవన్‌లోని శిక్షకురాలు కె.వి.జ్యోతి వద్ద నత్య శిక్షణ పొందింది. 2025లో ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలో శ్రీ నాగేంద్ర స్వామివారి ఆలయంలో సుబ్బారాయుడి షష్టిని పురస్కరించుకుని శ్రీరన్విత తొలి ప్రదర్శన ఇచ్చి అరంగేట్రం చేసింది. ఆ తర్వాత నందివాడ శివాలయంతో పాటు క్రిస్మస్‌ను పురస్కరించుకుని గుడ్లవల్లేరులోని గుడ్లవల్లేరు సిబిసిఎన్‌సి చర్చిలో అతి చిన్న వయసులోనే వరుస నత్య ప్రదర్శనల్ని ఇచ్చిన శ్రీరన్విత రికార్డు సష్టించింది. ఈ చిన్నారి ప్రతిభను చూసి ఎంతోమంది సీనియర్ నృత్య కళాకారులు అభినందిస్తున్నారు.

## సఖి వన్ స్టాప్ సెంటర్ వాహనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం కలెక్టరేట్ వద్ద సఖి వన్ స్టా ప్ సెంటర్‌కు కేటాయించిన ప్రత్యేక వాహనాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు ఎదుర్కొనే హింస, వేధింపులు, వివక్ష వంటి సమస్యలకు తక్షణ సేవలు అందించడంలో సఖి వన్ స్టాప్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభించిన ఈ వాహనం ద్వారా బాధితులకు తక్షణ చేరువ, కౌన్సిలింగ్, వైద్య, పోలీస్, న్యాయ సహాయం వంటి సేవలను వేగవంతంగా అందించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, సఖి వన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పి అర్చిష్మ, డిసిపిఓ. కిషోర్, చైల్డ్ లైన్ డిస్టిక్ కోఆర్డినేటర్ నాగరాజు, వన్ స్టాప్ సెంటర్, చైల్డ్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## శ్రీ షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవ వేడుకలు



**గుడ్లవల్లేరు జనవరి 19 మేజర్ న్యూస్ :** మండలంలోని కౌతవరం శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వాహకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయినాధునికి దాతలు బొబ్బా మధు, పుష్పేశ్వరి దంపతులు నూతన వస్త్రాలు సమర్పించారు. తెల్లవారుజాము నుంచే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, పూలాభిషేకాలు పూజారి చావలి మల్లికార్జున శర్మ పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొబ్బా ఝాన్సీ లక్ష్మి, వడ్లమూడి సీతారామమ్మ, బొబ్బా రంగనాయకమ్మ, తూము ప్రమీలా రాణీ, వడ్లమూడి పద్మజ, పడమటి సుజాత, కళ్ళేపల్లి సుధారాణి తదితరులు పాల్గొన్నారు. పూజాదికాలు ఘనంగా నిర్వహించారు శ్రీ షిర్డీ సాయి సేవా కమిటీ చైర్మన్ కానూరి బాలకష్ణ మోహన్(బాలు) కార్యక్రమాలను పర్యవేక్షించారు.



## శ్రీకాకుళేశ్వరుణి దర్శించుకున్న రామారావు

### ఆలయ ప్రాంగణంలో కళా రంగ దిగ్గజానికి ఘన గౌరవం..

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో వేంచేసియున్న శ్రీకాకుళేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రముఖ ఎన్నారై అంతర్జాతీయ ఖ్యాతి గల భారతీయ చిత్రకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్.వి. రామారావు ఆంధ్రమహావిష్ణు స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎస్.వి. రామారావు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయులు, యువనేత మండలి వెంకట్రామ్, టీడీపీ నేత తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), అచ్చెంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు తదితరులు శాలువా కప్పి సన్మానించారు. కళారంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2001లో ఎస్.వి. రామారావు పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసింది. 1965లో ఆయనకు "మోస్ట్ అవుట్‌స్టాండింగ్ ఆర్టిస్ట్ ఇన్ ది కామన్వెల్త్" అవార్డు లభించడం విశేషం. ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షులు దాసం రామకృష్ణ, జనసేన పార్టీ నాయకులు కొండవీటి నాని, తాడికొండ సాయి తేజ, పువ్వాడ రవికిరణ్, జీళ్ళ శ్రీనివాస్, మేక పుల్లయ్య, తిరుములశెట్టి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా పరిషత్ కార్యాలయం సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 32 మంది విద్యార్థులకు "స్ఫూర్తి" స్టడీ మెటీరియల్ పుస్తకాలను సోమవారం గ్రామ సర్పంచ్ కొండా జయలక్ష్మి, కొండా బసివిరెడ్డి దంపతులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దూడల శివనాగభవాని చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు మాట్లాడుతూ, విద్యార్థులందరూ "స్ఫూర్తి" స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఎక్కువగా ఉపయోగించుకుని 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు, అన్ని సబ్జెక్టులలో అత్యున్నత మార్కులు కూడా సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. వక్తలు కొండా బసివిరెడ్డి, దూడల శివనాగభవానిలు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తోందని, విద్యార్థులందరూ ఈవిషయాన్ని గుర్తించి బాగా చదువుకుని భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులతో పాటు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చల్లపల్లిలో టిటిడి కళ్యాణమండపం నిర్మించాలి

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి నారాయణరావునగర్లో రెండెకరాల కమ్యూనిటీ స్థలాన్ని ప్రత్యేక జీవో ద్వారా కేటాయించి టిటిడి నిధులు మంజూరు చేయించి టిటిడి కళ్యాణ మండపం నిర్మిం చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్లప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందచేసినట్లు మోర్ల ప్రసాద్ సోమవారం స్థానిక విలేకర్లకు తెలియచేశారు. చల్లపల్లి మేజర్ పంచాయతీలో 70శాతం సామాన్య మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారనీ, వారి అవసరాలకు తగినట్లుగా కళ్యాణమండపాలు లేవన్నారు. గ్రామంలో కమ్యూనిటీ భవనాలు సైతం లేవనీ, నారాయణరావునగర్లో పలుచోట్ల కమ్యూనిటీ స్థలం అందుబాటులో ఖాళీగా ఉందని చెప్పారు. 1995లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చల్లపల్లిలో పేదలకు నివేశనా స్థలాలు పంపిణీ చేసిన విషయం గుర్తు చేస్తూ ప్రజల అవసరాలకు తగినట్లుగా టిటిడి కళ్యాణమండప నిర్మాణానికి భూమిని కేటాయించి, నిధులు మంజూరు చేయించాల్సిందిగా కోరినట్లు వివరించారు. అలాగే తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి సైతం స్థలం మంజూరు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశానన్నారు.

# మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియచెప్పటం అందరి బాధ్యత

### ప్రవాస భారతీయులు, సుప్రసిద్ధ చిత్రకారుడు పద్మశ్రీ ఎస్.వీ.రామారావు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మహనీయుల ఘన చరిత్రను భావితరాలకు తెలియచెప్పటం అందరి బాధ్యత అని ప్రవాస భారతీయులు, సుప్రసిద్ధ చిత్రకారుడు పద్మశ్రీ ఎస్.వీ.రామారావు అన్నారు. సోమవారం స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా అమెరికా నుంచి వచ్చిన ఎస్.వీ.రామారావు స్వర్గీయ మండలి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతాన్ని విస్మరిస్తే వర్తమానం లేదన్నారు. వర్తమానంలో భావితరాలకు మహనీయుల ఖ్యాతి వివరించి చరిత్రను సజీవంగా నిలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా విశేష సేవలు అందించిన మండలి వెంకట కృష్ణారావు ప్రజా నాయకునిగా, ప్రజల కోసమే బ్రతికే నాయకునిగా జీవితమంతా గడిపారని తెలిపారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన సేవలు మరువలేనివి అన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఆయనను కలిసే అదృష్టం దక్కిందన్నారు.

మహాత్మా గాంధీని తరతరాలుగా స్మరిం చుకున్నట్లు ఎంవీ కృష్ణారావు సేవలు కూడా తరతరాలకు చిరస్మరణీయ మన్నారు. అంతటి మహనీయుడు మళ్ళీ పుడతాడా అనుకుంటే ఆయన తనయునిగా వారసునిగా మండలి బుద్ధప్రసాద్ చిత్ర, సంగీత, నృత్య రంగాల కళాకారులు అందరికీ ఏకైక నాయకునిగా అండగా నిలుస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా కళాకారులందరి గురించి ఆలోచించే ఏకైక తెలుగు నాయకుడు మండలి బుద్ధప్రసాద్ అని తెలిపారు. వారి తనయుడు మండలి వెంకట్రామ్ కూడా తండ్రి బాటలోనే నడవటం అభినందనీయం అన్నారు. మండలి వెంకట కృష్ణారావుకు నివాళి అర్పించే అవకాశం దక్కటం తన అదృష్టం అన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఎస్.వి.రామారావు చిత్రకళా ప్రపంచంలో తెలుగువారికి సమున్నత స్థానాన్ని కల్పించి, భారత ప్రభుత్వం ద్వారా అత్యున్నత పద్మశ్రీ పురస్కారం అందుకున్న గొప్ప చిత్రకారుడు అని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.వీ.రామారావును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తనయుడు మండలి వెంకట్రామ్, శత జయంతి కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు.

## స్ఫూర్తి పుస్తకాలు పంపిణీ



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని తొమ్మిది పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు కృష్ణా జిల్లా పరిషత్ విడుదల చేసిన ప్రేరణ స్ఫూర్తి పుస్తకాలను(స్టడీ మెటీరియల్) సోమవారం పంపిణీ చేశారు. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 29 మంది విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి పర్యవేక్షణలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ శీలంవెంకటేశ్వరరావుపంపిణీ చేశారు. అలాగే మొవ్వ పి.ఎం.శ్రీ శ్రీ మండల కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. ఉమాశ్రీ ఆధ్వర్యంలో సర్పంచ్ టి. పూర్ణచంద్రరావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ జి.బాబురావు 147 మంది విద్యార్థులకు అందజేశారు. అలాగే చినముత్తేవిలో 24, కాజలో 56,పెదసనగల్లులో 43, భట్ల పెనుమర్రులో 46, నిడుమోలులో 40, కోసూరులో 27, పెదముత్తేవి ఓరియంటల్ హైస్కూల్లో 12 మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**మొవ్వ మేజర్ న్యూస్:** పశువైద్య శిబిరాలను సద్వినియోపరుచుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ మౌర్య పశుపోషకులకు సూచించారు. మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని పెదముత్తేవి గ్రామంలో "ఉచిత పశువైద్య శిబిరం"నిర్వహించారు. ఈ శిబిరంలో 54 పశువులకు పరీక్షలు నిర్వహించి వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేసారు. 20 దూడలకు, 120 గొర్రెలు కు నట్టలనివారణ టీకాలు వేశారు. ఈ శిబిరంలో మొవ్వ మండల పశువైద్యాఅధికారి డాక్టర్ మౌర్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులనుండిపశువులను కాపాడుకోటానికి ఉచితముగా వేసే టీకాలు ప్రతిపశువుకి అందేలా చూడాలని లింగ నిర్ధారణ వీర్యము (పెయ్య దూడలు మాత్రమే పుట్టేలా) అందుబాటులో వచ్చిందని రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొనిగేదలకు పెయ్యిదూడలు మాత్రమే కలిగే లాభపడాలని సూచించారు. పశువులకు గర్భకోశవ్యాధులకు చికిత్స చేసుకొనుట ద్వారా పశువుల పునరుత్పత్తిసామర్థ్యము పూర్తి స్థాయిలోతీసుకువచ్చినట్లయితే పశువుల సంఖ్య పెరుగుతుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పలపాటి నాగ లక్ష్మిప్రసన, పాల కేంద్ర అధ్యక్షులుమురారికృష్ణ కుమారి గ్రామ నాయకులు పాడి రైతులు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోడ పత్రికలు ఆవిష్కరించారు.

## వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీ చర్యలు



**హనుమాన్ జంక్షన్, జనవరి 19, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం బాపులపాడు గ్రామపంచాయతీ పరిధిలో వీధి కుక్కల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా గ్రామపంచాయతీ కీలక చర్యలు చేపట్టింది. గ్రామంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉండటంతో పాటు, ఇటీవల ప్రజలపై దాడులు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ కార్యదర్శి శేష పూర్ణేశ్వరి తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్ సరిపల్లి కమలాకిరణ్, ఉపసర్పంచి దుట్టా శివన్నారాయణ, పాలక వర్గ సభ్యుల ఆదేశాల మేరకు వీధి కుక్కలను పట్టి అటవీ ప్రాంతాల్లో విడిచి పెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ, గ్రామంలో వీధి కుక్కల వల్ల ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే గ్రామంలో పెంపుడు కుక్కలు ఉన్న యజమానులు తమ కుక్కలను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని, అవసరమైన అనుమతులు గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామ ప్రజలంతా సహకరించాలని ఆమె కోరారు. గ్రామంలో ప్రజల భద్రత, శాంతియుత వాతావరణం కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని గ్రామస్తులు స్వాగతిస్తున్నారు.

## గండిగుండ గ్రామ పంచాయితీ కార్యదర్శి చదలవాడ కుమార్ రావును సస్పెండ్ చేయండి

### సామజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** 10% కామన్ సైట్ల రిజిష్టర్లు నిర్వహించని పంచాయితీ కార్యదర్శి పంచాయితీరాజ్ కమీషనర్, ముఖ్య కార్యదర్శులకు ఫిర్యాదు చేసిన సామజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ జి.ఓ.ఎం.ఎస్. నెం. 188, పి.ఆర్ & ఆర్.డి (పార్ట్ 4) డిపార్ట్‌మెంట్ తేది 21.07.2011, కమిషనర్ పి.ఆర్ & ఆర్.డి మెమో నెం: 2760941.సిపిఆర్ & ఆర్.డి/డి5/2025 తేది 23.03.2025, ప్రకారం గ్రామ పంచాయితీ కార్యదర్శులు లేఅవుట్లలోని 10% కామన్ సైట్లను రిజిష్టర్లలో నమోదు చేసి, కామన్ సైట్లు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సి ఉంది. కృష్ణాజిల్లా,ఉయ్యూరు మండలం, గండిగుంట గ్రామ పంచాయితీలో పంచాయితీ ఆస్తుల రిజిస్టర్లు లేవు. లేఅవుట్లలోని 10% కామన్ సైట్లను,లే అవుట్ యజమానులు అమ్ముకుంటున్న గండిగుంట గ్రామ పంచాయితీ కార్యదర్శి చదలవాడ కుమార్ రావు పంచాయితీ ఆస్తులను కాపాడేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గండిగుంట గ్రామ పంచాయితీలో 10% కామన్ సైట్లు విక్రయిస్తున్న ఎటువంటి చర్యలు తీసుకోని. కనీసం రిజిష్టర్లు నిర్వహించని గండిగుంట గ్రామ పంచాయితీ కార్యదర్శి చదలవాడ కుమార్ రావును సస్పెండ్ చేయాలని గౌ. రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ కి, కమీషనర్ వి.ఆర్. కృష్ణతేజ మైలవరపుకి ఫిర్యాదు చేయడం జరిగింది. అని జంపాన శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

# ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో ఖాళీగా ఉన్న సభ్యులకు ఎన్నికలు



## 20 ఏళ్ల తర్వాత వైద్య మండలి సభ్యుల ఎన్నిక

## రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

## ఫిబ్రవరి 9 న ఆన్ లైన్ ద్వారా ఓటింగ్..10 న ఫలితాల వెల్లడి

## రిటర్నింగ్ ఆఫీసర్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, కేవీఎన్ చక్రధర్ బాబు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ లో 13 మంది సభ్యులకు ఎన్నికలను ఫిబ్రవరి 9న ఆన్ లైన్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని సెకండరీ హెల్త్ డెరెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్, కేవీఎన్ చక్రధర్ బాబు తెలి పారు. స్థానిక తాడేపల్లి సెకండరీ హెల్త్ డెరెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏపీఎంసీ – 2026 ఎన్నికల ప్రక్రియపై సెకండరీ హెల్త్ డెరెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్, కేవీఎన్ చక్రధర్ బాబు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గౌరవ హైకోర్టు 6 వారాల్లోపు ఏపీ మెడికల్ కౌన్సిల్ లో (ఏపీ ఎంసీ) 13 మంది సభ్యులకు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. గౌరవ హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీఎంసీ ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. మెడికల్ కౌన్సిల్ చరిత్రలో తొలిసారిగా ఆన్ లైన్ (ఈ-ఓటింగ్) పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఏపీ మెడి కల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ చట్టం (1968) ప్రకారం రిజి స్టర్ అయిన ఎంబీబీఎస్ ఆపైన అర్హత కలిగిన డాక్టర్లు ఓటు వేసేందుకు అర్హులన్నారు. గత నెల రోజుల్లో 316 మంది కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 1871 మంది రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ (రెన్యువల్) చేసుకున్నారని, ప్రస్తుతం 55,504 మంది వైద్యులు ఓటర్ల జాబితాలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. రాష్ట్ర వైద్య మండలి (ఏపీ మెడికల్ కౌన్సిల్) సభ్యుల ఎంపిక కోసం వచ్చేనెల 9న ఆన్లైన్ ద్వారా ఎన్నికలను నిర్వ హించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ చక్రధర బాబు వెల్లడించారు. మండలి చట్టంలో సెక్షన్ 3 (2) (బి) కింద నిర్దేశించిన 13 మంది సభ్యుల ఎంపిక కోసం ఎన్నికల నోటి ఫికేషన్‌ను సోమవారం జారీ చేసినట్లు పేర్కొన్నారు. చివరిగా ఏపీ వైద్య మండలి ఎన్నికలు 2006 లో జరిగాయన్నారు. అర్హత కలిగిన వైద్యులు ఎక్కడ నుంచైనా ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉందని, ఇందుకు మొబైల్ ఫోన్ సైతం ఉపయోగించుకోవచ్చునని పేర్కొన్నారు.

**ఈ నెల 27వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం**

మండలిలో సభ్యత్వం కలిగిన 55,504 మందిలో ఎవరైతే రాష్ట్రం (లోకల్) లో ఐదేళ్లపైబడి ఉంటున్నారో వారు మాత్రమే ఎన్నికల్లో పోటీచేయడానికి అర్హ త కలిగి ఉంటారన్నారు. ఎన్నికల్లో పోటీచేయదల్చుకున్న వారి నామినేషన్లను మంగళవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు స్వీకరిస్తారన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చునని, ఫిబ్రవరి 2 వ తేదీన ఎన్నికల్లో పోటీచేసే అర్హత కలిగిన అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తా మన్నారు. ఫిబ్రవరి 9వ తేదీన apmc.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో లాగిన్ అ వ్వడం ద్వారా ఆన్ లైన్ మోడ్ లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. మరసటిరోజు ఫిబ్ర వరి 10 వ తేదీన ఉదయం 11 గంటల నుండి ఫలితాలు ప్రకటిస్తారన్నారు..

**లాగిన్ అయ్యే విధానం**

ఓటింగ్ కోసం అర్హత కలిగిన వైద్యులు ఏపీఎంసీ ఆన్ లైన్ ఎలక్షన్ పోర్టల్ లోకి లాగిన్ కావాలని, ఇందుకు ప్రత్యేక లింక్ అందుబాటులో ఉంటుంద న్నారు. లాగిన్ అనంతరం ఓటరు గరిష్టంగా 30 నిమిషాల వ్యవధిలో ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనలు ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తామన్నారు. ఓటింగ్ పూర్తయిన అనంతరం సభ్యునికి ఓటింగ్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిసేలా మెసేజ్ ఆన్లైన్లో కనిపిస్తుందన్నారు. గౌరవ హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, వైద్య మండలి రిజిస్ట్రార్ ఐ. రమేష్ తెలియజేశారు.

# మహిళలే సాయి మందిర నిర్వాహకులు






**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** భూదేవికి ఉన్న ఓర్పుతో మహి ళలు తన కుటుం బాన్నే గాక సమా జాన్ని కూడా తీర్చిదిద్ద గలరు. తన సున్నితమైన సృజనతో ఎన్నో విజయాలను సా ధిస్తున్నారు. పారి శ్రామిక, ఉద్యోగ, వ్యాపార, వైమానిక, విద్యా రంగాల్లో తమ సత్తాను చా టుతూ తాము అబలలం కాదు సబలలం అంటూ మగువలు నిరూపిస్తు న్నారు. అలాగే కొందరు గృహిణులు కలసి తామే స్వయంగా ఆలయాన్ని నిర్మించి దానిని తొమ్మిదేళ్ల పాటు నిర్వహించి ఘనతకెక్కారు. ఎవరో కట్టించిన గుడిలో కృష్ణా రామా అనుకోకుండా తామే ఒక ఆలయాన్ని నిర్మించేందుకు సంకల్పించుకుని సఫలీకతమయ్యారు. వారే గుడ్లవల్లేరు మండలం కౌతవరం కు చెందిన శ్రీ షిరిడీ సాయి మందిర మహిళా నిర్వాహకులు. సేవా ట్రస్టును కూడా స్థాపించి గుండె, కంటి, సాధారణ వైద్య శిబిరాలను వీరు నిర్వహిస్తు న్నారు. కుట్టు మిషన్లు అందిస్తున్నారు. పేద పిల్లల్ని చదివించేందుకు ఆర్థికసాయం చేస్తున్నారు. సంక్రాంతికి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. శ్రీ షిర్డీ సాయి సేవా కమిటీ చైర్మన్ కానూరి బాలకష్ణ మోహన్(బాలు) చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్నారు. పేదలకు వస్త్రదానంతో పాటు చలికాలంలో వృద్ధులకు దుప్పట్లను అందిస్తున్నారు. ఈ సేవలను దాతల సహకారంతోనే చేస్తున్నట్టు ఆలయ మహిళా నిర్వాహకులు బొబ్బా ఝాన్సీలక్ష్మి, వడ్లమూడి వెంకట శైలజ, వాపరాల విజయలక్ష్మి, కళ్లేపల్లి సుధారాణి, బొబ్బా రంగనాయకమ్మ, పడమటి సుజాత, తూము ప్రమీలారాణి, వడ్లమూడి సీతామహాలక్ష్మి చెబుతున్నారు.

**ఆలయ నిర్మాణ వృత్తాంతమిది**

ప్రస్తుత ఆలయ సరిహద్దులో స్వర్గీయ అడుసుమిల్లి నాగమణి నివశించేవారు. ఆమె సాయి భక్తురాలు. పూజగదిలో ఉన్న బాబావారి చిత్రపటం నుంచి విబూది రాలిందని ఆమె సాయి భజనను పెట్టించారు. ఊరిలోని మహిళా భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. శ్రీ షిరిడీ సాయి మందిరాన్ని నిర్మా ణం చేయాలని నాగమణికి ఆలోచన వచ్చింది. ఆమె ఇంటి పక్కనున్న తన సొంత స్థలాన్ని కేటాయించారు. అక్కడున్న మహిళలు ఆమె ఆలోచనకు మద్ద తు పలికారు. అంతే మహిళలు కొద్దికాలంలోనే ఆలయాన్ని నిర్మించేశారు. 2007 జనవరి 22వ తేదీన గుడిని ప్రారంభించారు. దాతల సహకారంతోనే ఈ భారీ మందిరాన్ని నిర్మించేందుకు ఎన్నో వ్యయప్రయాసలకోర్చారు. గుడి మెయింటినెన్స్‌కు కూడా దాతలే సహకరిస్తున్నారు. ప్రతి గురువారం సాయికి ప్రత్యేక పూజలతో పాటు విశేషాభిషేకాలు జరుగుతాయి. ఆలయ వార్షికోత్సవాలతో పాటు గురుపౌర్ణమికి భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.








## స్టడీమెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ఎంపీడీవో రామకృష్ణ నాయక్**

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం డెమొక్రటిక్ పిఆర్టీయు వారు తయారుచేసిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్ అన్నారు సోమవారం డెమొక్రటిక్ పి ఆర్ టి యు వారు తయారు చేసిన మెటీరియల్ను ఆవిష్కరించి మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల కోసం ఉచిత స్టడీ మెటీరియల్లు అందించటం సంతోషించదగిన విషయ మని విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ నాయక్ అన్నారు. జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి నాగరాజు మాట్లాడుతూ డెమొక్రటిక్ పిఆర్టీయు అనుబంధంగా ఉన్నసేవాదళ్ కార్యక్రమంలో భాగంగా వెనుకబ డిన విద్యార్థుల కోసం ఈ మెటీరియల్లు ప్రతి ఉన్నత పాఠశాలకు అందజే యడం జరుగుతుందన్నారు. అనంతరం జి కొండూరు మండల ప్రధాన కార్యదర్శిగా కంచర్ల శ్రీరామ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అక్బర్ పాషా ఏ శ్రీనివాస్ జి కొండూరు అధ్యక్షులు ఆర్ డేవిడ్ రాజు వాసు రామారావు కిరణ్ విజయ్ రంజిత్ సురేంద్ర సాంబశివరావు విద్యాసాగర్ మహిళా కార్యదర్శులు ఎన్ వరలక్ష్మి ఏ సత్యవాణి జి ఎస్ ఎస్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

## యోగివేమన జయంతికి సీపీ నివాళి



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగర పోలీస్ కమీషనర్ ఎస్. వి. రాజ శేఖర బాబు వారి కార్యాలయంలో యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి వారు చేసిన సేవలను స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.సి.పి.లు కృష్ణ కాంత్ పటేల్, కె.జి.వి.సరిత, సి. పి. ఓ అధికారులు, పోలీస్ అధికారులు, సి.పి.ఓ. సిబ్బంది తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. యోగివేమన తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి అర్థమయ్యే భాషలో పద్యాలు రాసి ప్రజలను మెప్పించిన మహాకవి అని తెలిపారు. వేమన పద్యాలు వినని, తెలియని వారు లేరనడంలో అతిశయోక్తి లేదన్నారు. యోగివేమన జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించడం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులను రక్షిద్దాం..



**రోడ్డు ప్రమాద క్షతగాత్రుల వైద్యానికి మొదటి గంట - గోల్డెన్ అవర్**

**జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ**

**విజయవాడ జనవరి 19, మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందకపోవడం వల్లన అనేక మరణిస్తున్నారని ప్రమాదం జరిగిన మొదటి గంట ఎంతో అమూల్య మైందని ఆసమయంలో సరైన చికిత్స అందించ గలిగితే దాదాపుగా మరణాలను నివారించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అన్నారు. విజయవాడ బందర్ రోడ్డులోని జిల్లా కలెక్ట్రేట్ గల జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా రవాణా శాఖ అధికారులు రూపొందించిన గుడ్ సమరిటన్ పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి మొదటి గంట చాలా కీలకమైన సమయమని, దీనినే గోల్డెన్ అవర్ గా పరిగణించాలన్నారు. ఈ మొదటి గంటలో సరైన వైద్యం అందించినట్లయితే, ప్రాణాలు కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని బాధితులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. ప్రమాదాలకు గురైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు చాలా మంది భయపడుతున్నారని, కేసుల్లో ఇరుక్కుంటామేమోనని ఆందోళన చెందుతున్నారని, కానీ అలాంటి భయం అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రహవీర్ చట్టం తీసుకువచ్చిందని, మోటారు వాహనాల చట్టం సెక్షన్ 134 (ఎ) ప్రకారం రహవీర్ (గుడ్ సమరిటన్) లకు రక్షణ కల్పించబడుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాద సమాచారాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు లేదా అత్యవసర సర్వీసులకు తెలియజేసిన వారు, క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్పించిన వారు, తమ పేరు లేదా వ్యక్తిగత సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరూ వత్తిడి చేయరని ఆమె చెప్పారు. ప్రమాద బాధితులను ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిపోవచ్చని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రిలో చేర్పించిన రహవీర్ (గుడ్ సమరిటన్)లకు ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతిగా రూ. 25,000లు అందజేస్తుందని అన్నారు. ప్రమాద బాధితులకు తమ వంతు బాధ్యతగా సహాయం అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కె.బాలకృష్ణ, ఆర్డీఓ నందిగామ, కె.మాధురి ఆర్డీఓ తిరువూరు, ఆర్టీఓ కె. వెంకటేశ్వరరావు, మోటార్ వెహికల్ తనిఖీ అధికారులు ఎ. ఉదయ శివ ప్రసాద్, డివి రమణ, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

# తెలుగు వారందరికీ చిరస్మరణీయులు మహాకవి వేమన



## యోగి వేమనకు నివాళులర్పించిన కలెక్టర్ డీ కే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ మీటింగ్ హాల్‌లో ప్రజాకవి, సామాజిక సంస్కర్త యోగి వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ,జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఓ కే.చంద్రశేఖర రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, వివిధ శాఖల అధికారులు

## మహాకవి వేమన తెలుగు వారందరికీ చిరస్మరణీయులు



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** ఆట వెలదులను ఈటెలుగా చేసి నాటి సమాజ రుగ్మతలను చీల్చి చెండాడిన మహాకవి వేమన తెలుగు వారందరికీ ప్రాతఃస్మరణీయుడని పెదపారుపూడి ఎంపీడీఓ జె.విమాదేవి పేర్కొన్నారు. యోగి వేమన జయంతిని పురస్కరించుకొని సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ యేసుపాదం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి, నారికేళములు కొట్టి, పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యేసుపాదం మాట్లాడుతూ వేమన పద్యం తెలియని తెలుగువారు ఉండరని, తన పద్యాల ద్వారా నేటికీ, ఏనాటికీ వేమన ప్రజల్లో నిలిచే ఉంటారని పేర్కొన్నారు. డిప్యూటి ఎంపిడిఓ వంగా శ్రీనివాస్ వేమన పద్యాలను రాగయుక్తంగా పాడి ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ షహనాజ్, రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ సుందరం, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సనకా శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో..

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** యోగి వేమన పద్యాలు సమాజానికి నైతిక విలువలను అందించాయని విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్, అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్ర రావు అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద యోగివేమన జయంతి పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగివేమన పద్యాలు సమాజానికి నైతిక విలువలను అందించాయని, వాటిని చిన్నప్పటి నుంచే అభ్యసించడం వల్ల వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని అన్నారు. సామాజిక సమానత్వం, మానవతా విలువలు, నిజాయితీ, కష్టపడి జీవించడం వంటి అంశాలను యోగివేమన తన పద్యాల రూపంలో తెలిపారని, ఇటువంటి విషయాలని భావితరాలకు అందించాల్సిన బాధ్యత



ప్రతి ఒక్కరిపై ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) పి.సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణ మూర్తి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్ట్ కామేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేమన పద్యాలు.. సామాజిక చైతన్య దీపికలు

**జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రజాకవి, సంఘ సంస్కర్త యోగి వేమన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని.. ఆయన పద్యాలు సామాజిక చైతన్యానికి ప్రతీకలు అని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. సోమవారం యోగి వేమన జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులతో కలిసి యోగి వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సామాజిక చైతన్యంతో కూడిన వేమన పద్యాల సాహిత్య ఔన్నత్యాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జేసీ ఇలక్కియ మాట్లాడుతూ సమాజంలోని వివిధ సమస్యలను భిన్న కోణాల్లో స్పృశించి.. వేమన తన పద్యాల్లో విలువలను చొప్పించారని పేర్కొన్నారు. నేటి తరానికి యోగి వేమన జీవితం, శతక సాహిత్యం గురించి అవగాహన పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరళ భాషలో, ఉదాహరణలతో వేమన పద్యాలు ప్రతి ఒక్కరి హృదయాలను స్పందింపజేస్తాయని జేసీ ఇలక్కియ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జంక్షన్ ఎస్ఐ2గా లంక సత్యకళ



**హనుమాన్ జంక్షన్, జనవరి 19, మేజర్ న్యూస్ :** హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ2గా లంక సత్యకళ సోమవారం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 202425 బ్యాచ్‌కు చెందిన సత్యకళ అనంతపురంలో ప్రాథమిక పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని, కృష్ణా జిల్లా పామర్రు పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన అధికారిణిగా గుర్తింపు పొందిన సత్యకళ, హనుమాన్ జంక్షన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. సత్యకళ స్వగ్రామం కాకినాడ సమీపంలోని మర్లపాలెం గ్రామం. ఆమె ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు ఆమెకు అభినందనలు తెలిపారు.

## వీరవల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సత్యం సురేష్



**హనుమాన్ జంక్షన్, జనవరి 19, మేజర్ న్యూస్ :** హనుమాన్ జంక్షన్ సర్కిల్ పరిధిలోని వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా సత్యం సురేష్ సోమవారం సాయంత్రం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2024-25 బ్యాచ్‌కు చెందిన సురేష్ అనంతపురంలో ప్రాథమిక పోలీస్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. అనంతరం కృష్ణా జిల్లా కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా విధులు నిర్వహించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సురేష్ హనుమాన్ జంక్షన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన అధికారిగా సురేష్‌కు మంచి పేరు ఉంది. సత్యం సురేష్ స్వగ్రామం రాజమండ్రి సమీపంలోని సీతానగరం. గత ఏడాదిన్నర కాలంగా వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో సేవలందించిన ఎస్ఐ ఎం.శ్రీనివాస్ గన్నవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానికులు సురేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## చల్లపల్లి ఎస్ఐగా దుర్గా ఆంజనేయులు



**◆ ఎస్ఐగా తొలిపోస్టింగ్ ◆**

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి ఎస్ఐగా దంపనబోయిన దుర్గా ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుడ్లవల్లేరు పోలీస్టేషన్లో పీఎస్ఐగా పనిచేసిన ఆయన చల్లపల్లి ఎస్ఐగా తొలిపోస్టింగ్ అందుకుని ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. చల్లపల్లి ఎస్ఐగా పనిచేసిన కె.వై.దాస్ కంకిపాడు ఎస్ఐ 2గా బదిలీపై వెళ్లారు.

## ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**డీఎస్పీ పి.రాజా**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పేరు ఫోటోలను ఉపయోగిస్తూ ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఫేక్ ఫేస్ బుక్ అకౌంట్లు సృష్టించి,వాటి ద్వారా ప్రజలకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపిస్తూ, డబ్బులు కావాలని డిమాండ్ చేస్తున్నట్లు పోలీసు శాఖ అధికారుల దృష్టికి వచ్చింది. దీనితో అప్రమత్తమైన అధికారులు ప్రజలు ఎవరూ కూడా ఇటువంటి ఫేక్ అకౌంట్లను నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు పంపవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ నగర డి.ఎస్.పి రాజా ఓ ప్రకటనను విడుదల చేశారు. ఇప్పటికే ఈ ఫేక్ అకౌంట్లపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, అకౌంట్లు సృష్టించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించారు. ఇలాంటి ఫేక్ అకౌంట్లు లేదా అనుమానాస్పద సందేశాలు కనిపిస్తే, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999